క్లుప్తంగా

వైభవంగా రామకోటి మహోత్సవాలు



జ్యోతిర్లింగార్చన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయం 10.30 గంటల నుంచి పార్థివ లింగానికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నగరపాలక సంస్థ విప్ పైడి భీమేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మాడా రామారావు దంపతుల ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన చేశారు. రాత్రి నగరానికి చెందిన కళాదీపిక నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి పార్వతి రామచంద్రన్ శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా అలరించాయి. దివాకరుని శ్రీ వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులకు నష్టం

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులు నష్టపోతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆరోపించింది. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. రైతాంగ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను బీజేపీ ప్రభుత్వం నేటికీ అమలు చేయాలేదని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్, మిర్చి, అరటి, వర్జీనియా పొగాకు, కొబ్బరి తదితర పంటలకు కనీస మద్దతు ధరలు కల్పించాలని, ఆయిల్ పామ్ టన్ను గెలలకు రూ.18 వేలు ఇవ్వాలని కోరారు. పెదవేగి మండలం విజయరాయిలో నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, గ్రీన్ ఫీల్డ్ హైవే, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూనిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుంటా పాపారావు, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

- తెల్లవారుజాము నుంచే రుద్రాభిషేకాలు
- మహాదేవుని దర్శనానికి బారులు తీరిన భక్తులు



విశేష అలంకరణలో పత్తేబాద రామలింగేశ్వర స్వామి



పవర్‌పేట విశ్వేశ్వర స్వామిని దర్శించుకుంటున్న మేయర్ నూర్జహాన్ దంపతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరం శివనామ స్మరణతో మార్మోగింది. శైవ క్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. స్వామి వార్లకు విశేష అలంకరణలు చేశారు. రాత్రి ఆయా ఆలయాల్లో శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వార్లను దర్శించుకోవడానికి వివిధ శైవక్షేత్రాల్లో భక్తులు పోటెత్తారు. పత్తేబాద శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జామున 4 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, తైలాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి భజన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శివజ్యోతి కార్యక్రమం అనంతరం స్వామి వారి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. రాత్రి లింగోద్భవ కాలంలో స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు కొడమంచిలి లక్ష్మణ రావు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి డి.శంకర రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

- అగ్రహారంలోని గంగా, వింధ్యవాసినీ సమేత నగరేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జాము నుంచి 8 గంటల వరకు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అభిషేకాలు అనంతరం అలంకరణ చేశారు. రాత్రి స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించి రాత్రి 10 గంటల నుంచి లింగోద్భవ కాలంలో రాత్రి 12 గంటలకు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు స్వామి వారికి విశేష పూజలు చేశారు. అర్చకులు చెరుకూరి మల్లికార్జునరావు ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి రామపెద్దింట్ల రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.
- పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 4 గంటలకు పంచామృతాలతో, పండ్ల రసాలతో, సుగంధ ద్రవ్యాలతో మహారుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి 12 గంటల వరకూ లింగోద్భవ కాలంలో స్వామి వారికి 516 కేజీల పంచదారతో మహా శర్కరాభిషేకం చేశారు. రాత్రి 12 గంటలకు 27 హారతులతో స్వామి వారికి విశేష హారతి సేవ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు కందుకూరి రామ బ్రహ్మానంద శర్మ ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం.రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.
- దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామి వారికి అహోరాత్ర మహాశివరాత్రి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, మహన్యాస పారాయణ అనంతరం ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. సాయంత్రం ప్రదోషకాల అభిషేకాలు, లక్ష్మీగణపతి, నవగ్రహ, మృత్యుంజయ సహిత రుద్రహోమాలు నిర్వహించి పూర్ణాహుతి నిర్వహించారు. పార్వతీ కల్యాణం, లక్ష బిల్వార్చన, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో విశేష అభిషేకాలు చేశారు. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారు జాము 4 గంటల వరకూ భజన, దివ్యనామ సంకీర్తన, జాగరణ కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు గంటసాల రామకృష్ణ, ప్రతాప కృష్ణ కిషోర శర్మ పూజలు చేయగా, క్షేత్రం వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని, కార్యదర్శి కాకి బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.
- దక్షిణపు వీధి జలాపహరేశ్వర స్వామి, మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి, అగ్రహారం అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, ఆదివారపుపేటలోని పర్వతవర్ధని సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానాల్లోనూ విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.



నగరేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



దొండపాడు శ్రీ నందత్తనాథ క్షేత్రంలో అభిషేకం చేస్తున్న భక్తులు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఘనంగా మహిళా దినోత్సవం

ఏలూరు (టూటౌన్): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించిననాడే నిజమైన స్వాతంత్ర్యం అని ప్రముఖ పారిశ్రామిక వేత్త, సంఘసేవకురాలు పెరికె దీనా గ్లాడి అన్నారు. జ్యూట్ బ్యాగ్స్ తయారీ ఇండస్ట్రీ స్థాపించి 15 ఏళ్లుగా నిరుద్యోగ మహిళలకు జ్యూట్ బ్యాగ్ తయారీలో శిక్షణ ఇస్తున్న ఆమెను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక లంకపేటలోని కార్యాలయంలో డ్వాక్రా సంఘాల మహిళలు సత్కరించారు. ఈ సందర్భంగా దీనా గ్లాడి మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తోన్న సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో మళ్లీ పట్టం కట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. త్వరలో విశాఖ పట్టణంలో జ్యూట్ బ్యాగ్ ఇండస్ట్రీని ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. పలువురు డ్వాక్రా మహిళలు, దళిత జేఏసీ మహిళలు, పాల్గొన్నారు.

అశ్లీలత, హింసను అరికట్టాలి

ఇంటర్నెట్, సినిమాల్లో అశ్లీలత, హింసను అరికట్టాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక టైటస్ నగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు పి.కిషోర్, ప్రభు అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షురాలు కె.ప్రభావతి మాట్లాడారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టాగూర్ రాజా, కె.పద్మలీల, జె.రజని, ఎల్ మంగమ్మ, కె.మౌనిక, జె.సుమతి, కె.అనసూయ, పి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సమాన హక్కుల కోసం పోరాడాలి

స్త్రీ, పురుషుల సమాన హక్కుల కోసం పోరాడాలని ప్రగతి శీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.పద్మ పిలుపు నిచ్చారు. ఇఫ్టూ, పీవోడబ్ల్యూ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో సంఘం నాయకురాలు సింహాచలం అధ్యక్షతన ప్రత్యేక సదస్సు నిర్వహించారు. మహిళలకు ఓటు హక్కు, ప్రాథమిక హక్కుల కోసం పోరాడిన క్లారా జాట్‌కీన్‌కు జోహార్లర్పించారు. దేశంలోని బీజేపీ ప్రభుత్వం మహిళల హక్కులను కాలరాస్తూ అనేక చట్టాలను తీసుకొచ్చిందని, మహిళలకు పని ప్రదేశాలలో భద్రత కరువైందని పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ మారణహోమాన్ని సృష్టిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడారు. ఎ.పద్మ, కొండమ్మ, కె.లక్ష్మీనారాయణమ్మ, డి.రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

బోఫ్ ఆధ్వర్యంలో..

బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బోఫ్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన వివిధ రంగాలకు చెందిన మహిళలను ఘనంగా సన్మానించారు. వీరిలో ప్రముఖ అధ్యాపకురాలు డాక్టర్ ఫాతిమా, సామాజిక రంగం నుంచి నెరుసు నాగమణి యాదవ్, విద్యావిభాగం నుంచి ఉషారాణి, విజయ గాయత్రి, బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఈడీ ఎన్ పుష్పలత, పంచాయతీ రాజ్‌కు చెందిన కొయ్యే సునీత, ప్రభుత్వ వలంటీర్ వ్యవస్థ నుంచి విజయలక్ష్మి, ప్రైవేటురంగం నుంచి మరి కొందర్ని సన్మానించారు. బోఫ్ జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మానవత ఏలూరు అధ్యక్షులు మేతర అజయ్ బాబు, పెరియార్ అంబేద్కర్ పూలే, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఆర్ విఠల్ కుమార్, బోఫ్ కార్మిక విభాగపు నాయకులు దేవరపల్లి రత్నబాబు, నటరాజ్,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు వసంత కుమార్, దేవరకొండ శ్రీనివాసరావు, విభిన్న ప్రజా సంఘాల నాయకులు గూడె రాంబాబు, విజ్ఞాన్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళలు దేశాభివృద్ధికి పట్టుగొమ్మలని గరికపాటి ఆర్ట్స్ థియేటర్ సంస్థ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు అన్నారు. స్థానిక గరికపాటి ఆర్ట్స్ థియేటర్ సంస్థ ఆధ్వర్యంలో రామకృష్ణాపురంలోని సాహిత్య మండలిలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి కాళిదాసు అధ్యక్షత వహించి మాట్లాడారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన మహిళామణులు గుడిపాటి లలిత, వేదుల జయలక్ష్మి, సన్నిధానం రామలక్ష్మి, కోటమర్తి బ్రహ్మేశ్వరి, రేవతి రామ్ కుమార్, దేవరకొండ శాంత, వి.సుబ్బలక్ష్మి, ఈదర సరస్వతి, పుల్లాభొట్ల వాణి, డి.సరస్వతిలను ఘనంగా సన్మానించారు. రచయిత గురు శర్మ రచించిన అవనిలో ఆడపిల్ల గేయాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ కొంపెల్ల తాయారు, గాయని గుడిపాటి శిరీష, పుల్లాభొట్ల సత్యవాణి, వి.మనస్విని, పుల్లాభొట్ల పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమెషీన్ల పంపిణీ

ఏలూరు సెయింట్ ఆంథోని స్కూల్‌లో హేలాపురి విజన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమెషీన్లను ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మహిళలకు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు పద్మశ్రీని ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకుడు ఘంటా ప్రసాదరావు, బీసీ మహిళ నాయకురాలు గుత్తుల బాలా త్రిపుర సుందరి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏలూరు (టూటౌన్) : పెరికే దీనా గ్లాడిని సత్కరిస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు



ఏలూరు (టూటౌన్) : ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్



ఏలూరు (టూటౌన్) : బోఫ్ ఆధ్వర్యంలో మహిళలను సత్కరించిన దృశ్యం



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : అవనిలో ఆడపిల్ల గేయాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

నేడు ఎమ్మెల్యే కొఠారు పర్యటన ఇలా..

ఏలూరు రూరల్ : ఎమ్మెల్యే కొఠారు అబ్బాయ్య చౌదరి ఏలూరు రూరల్ గ్రామాల్లో శనివారం పర్యటించనున్నారని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు తెలిపారు. ఉదయం 9.30 గంలకు చాటపర్రు 1వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీరోడ్ల ప్రారంభిస్తారని, ప్రధాన గ్రామంలో శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. మొండికోడు గ్రామంలో సుమారు రూ.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రహరీ, జంబోషెడ్డును ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం జగనన్న చేయూత లబ్ధిదారుల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు.

శ్రీవారి క్షేత్రానికి సాయి దివ్య రథయాత్ర

ద్వారకాతిరుమల: ఏలూరు తూర్పువీధి శ్రీ షిర్డీ సాయి మందిరం నుంచి భక్తులు శుక్రవారం శ్రీవారి దివ్య క్షేత్రానికి పాదయాత్రగా విచ్చేశారు. 18 ఏళ్లుగా ప్రతి ఏటా మహా శివరాత్రి పర్వదినాన షిర్డీ సాయిబాబా ఉత్సవ మూర్తిని రథంలో ఉంచి, రథాన్ని తాళ్లతో లాగుతూ ఏలూరు నుంచి ద్వారకాతిరుమలకు పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం ఏలూరు నుంచి ప్రారంభమైన ఈ యాత్ర తడికలపూడి, రామన్నగూడెం మీదుగా రాత్రికి క్షేత్రానికి చేరింది. మేళతాళాలు మంగళ వాయిద్యాలు, బాబా సంకీర్తనల నడుమ రథాన్ని లాగుతూ భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి పాదుకామండపం వద్ద విశేష పూజలు చేసి, బాబా గీతాలాపన చేశారు. అనంతరం భక్తుంతా శ్రీవారు, అమ్మవార్లను దర్శించారు. దారిపొడవున భక్తులకు పలువురు దాతలు మజ్జిగ, మంచినీరు, అల్పాహారం, పండ్లను అందజేశారు.

రైతుకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే కొఠారు

దెందులూరు: కష్టకాలంలో ఉన్న రైతుకు ఎమ్మెల్యే కొఠారు అబ్బాయ్యచౌదరి రూ. 25 వేలు ఆర్థిక సాయం అందించి ఆదుకుని మానవత్వాన్ని చాటుకున్నారు. దెందులూరులో యాదవ పేటకు చెందిన కట్టా నాగరాజు ఎడ్ల బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అతని రెండు ఎద్దులు మరణించాయి. దీంతో జీవనోపాధిని కోల్పోయి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొఠారు నాగరాజుకు రూ. 25 వేలు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ నగదును వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని శుక్రవారం శ్రీరామవరంలోని ఆయన కార్యాలయంలో రైతుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో దెందులూరు మండల యువజన విభాగ అధ్యక్షుడు గొరిపర్తి శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	38
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	10
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	09
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	30	కంద	68
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	40
కాకర కాయలు	30-40	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	80
కాలీఫ్లవర్	30	అల్లం	120
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	40-44	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24-28	గోంగూర	08
గోరుచిక్కుడు	38	పుదీనా	05
దోసకాయలు	24	బజాజీ	--
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

మహిళల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి



మహిళలను అభినందిస్తున్న బిషప్ పొలిమేర జయరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజంలో మహిళల సర్వతోముఖాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏలూరు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు పిలుపునిచ్చారు. సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ తాతపూడి ఇమ్మానియేలు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సోషల్ సర్వీస్ సెంటర్ ప్రాంగణంలో మహిళా దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జయరావు మాట్లాడుతూ మహిళలను ఆయా రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా ఇల్లు, సమాజం రంగాల్లోనూ ముందుకెళుతుందని అన్నారు. సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఇమ్మానియేలు మాట్లాడుతూ ఈ సెంటర్ ద్వారా 1976వ సంవత్సరం నుంచి మహిళల అభివృద్ధి - వికాసం వైపు ప్రయాణిస్తున్నామన్నారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ విద్యతోనే మహిళాభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ హేమలత గుడిసేన మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంతో పాటు కుటుంబ ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. హైకోర్టు న్యాయవాది జి.మేరీ సునీత మాట్లాడుతూ మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన మహిళలను సోషల్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కామవరపుకోట, లింగపాలెం, పెదవేగి, దెందులూరు, నిడదవోలు, పెదపాడు, ఏలూరు మండలాల నుంచి హాజరైన మహిళలు, యువతుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఫాదర్లు ప్రసాద్, పీటర్ ప్రసాద్, ఐ.గ్జేవియర్, జోజప్ప, జోసఫ్, గంట సుధాకర్, జి.మోజెస్, ఇంజే పాల్, జాకబ్, అంతోని, మైఖేల్ ఇంజమాల తదితరులు పాల్గొన్నారు.